క్లుప్తంగా

అనురాగ నిలయానికి సామగ్రి వితరణ


సామగ్రి అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకల్యాణ్ అనురాగ నిలయానికి చైల్డ్ ఫండ్ ఇండియా ఇంటర్నేషనల్ పీపుల్ లివింగ్ విత్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై పని చేస్తున్న సంస్థ నిర్వాహకులు పలు ఆహార వస్తువులు, వస్త్రాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణాధికారి డాక్టర్ అనురాధ, రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, బి.చిన్నయరావు, కె.సత్యనారాయణ, చైల్డ్ ఫండ్ ఇండియా సిబ్బంది, అనురాగ నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

విజయగణపతికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఉమాజఠలేశ్వరునికి ప్రత్యేక అలంకరణ


ఉమాజఠలేశ్వర స్వామి
ఉమాజఠలేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వర దేవాలయంలో స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

డాక్టర్ అనురాధకు సత్కారం


అనురాధను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ ఎస్.అనురాధ ఈ నెలాఖరున స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ అనురాధ పేదలకు నిస్వార్థంగా సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కనుగుల దుర్గా శ్రీనివాసరావు, బి.చిన్నయరావు, కె.సత్యనారాయణ, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మెస్ నిర్వహణ మెరుగ్గా ఉండాలి


వంటగదిని పరిశీలిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: మెస్ నిర్వహణ మెరుగ్గా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలోని మెస్, వసతి గృహాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిచెన్ పరిశుభ్రంగా ఉండాలన్నారు. అవసరమైన విద్యార్థులకే గదులు కేటాయించాలని చెప్పారు. అనంతరం రూ.35 లక్షలతో నిర్మిస్తున్న పరిపాలన భవనం పనులు పరిశీలించారు. గడువులోపు భవనం పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, వర్సిటీ ఇంజినీర్ అంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ


క్రీడా దుస్తులతో విద్యార్థులు, హెచ్‌ఎం జయలక్ష్మి

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి క్రీడాదుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ బలివాడ యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుందరంగా నందనవనాలు

- నగర పరిధిలో కొత్తగా రూ.1.13 కోట్లతో పార్కుల నిర్మాణం
- రూ.2 కోట్లతో పాత పార్కుల ఆధునికీకరణ
- రిజర్వు స్థలాలను పార్కులుగా మార్చే యోచన


రూ.48 లక్షలతో అభివృద్ధి చేసిన కొత్తపేట పార్కు



శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని పార్కులపై అభివృద్ధి మార్కులు కనిపిస్తున్నాయి. నిన్నమొన్నటి వరకు అసాంఘికకార్యకలాపాలకు నిలయంగా ఉన్న పార్కులు నేడు ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి. శ్రీకాకుళం నగరంలో రూ.1.13 కోట్లతో పార్కులను అభివృద్ధి చేయడంతో చిన్నపిల్లలతో పాటు విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, స్థానికులకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. రంగుల లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల రాత్రి వేళ మరింత సుందరంగా కనిపిస్తున్నాయి. కలెక్టర్ కార్యాలయం సమీపంలోని కొత్తపేటలో రూ.48 లక్షలు, శాంతినగర్ కాలనీలో రూ.32 లక్షలు, పీఎన్ కాలనీలో రూ.32 లక్షలు వెచ్చించి పార్కులను నిర్మించారు. నగర పాలక సంస్థ సాధారణ నిధులతో ఈ నిర్మాణాలు చేపట్టారు. కొద్ది రోజుల క్రితమే ఈ మూడు పార్కులను అందుబాటులోకి తీసుకువచ్చారు.

రూ.2కోట్లతో పాత పార్కుల ఆధునీకరణ..

నగరంలో మూడు పార్కులను సుమారు రెండు కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునీకరిస్తున్నారు. బైరివానిపేట సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విజయాదిత్య పార్కును రూ.1.5 కోట్లతో, కలెక్టర్ బంగ్లా సమీపంలో ఉన్న కార్గిల్ విక్టరీ పార్కును రూ.20లక్షలతో, జిల్లా పరిషత్ ఎదురుగా హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఉన్న పార్కును రూ.30 లక్షలతో ఆధునీకరిస్తున్నారు. ఈ పనులన్నీ 50 నుంచి 80 శాతం వరకు పూర్తయ్యాయి.

పార్కులుగా రిజర్వు స్థలాలు..

నగరంలోని మరికొన్ని పార్కుల అభివృద్ధికి అంచనాలు రూపొందిస్తున్నారు. వీటికి ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు. నగరంలోని పలు కాలనీల్లో ఖాళీగా ఉన్న రిజర్వు స్థలాలను పార్కులుగా మల్చాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించడంతో అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.


కొత్తపేట పార్కులో పచ్చదనం


విద్యుత్ కాంతులతో పీ.ఎన్.కాలనీ పార్కు

అభివృద్ధి పనులకు అంచనాలు



నగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించాం. పార్కులతో పాటు నగర ప్రవేశ ద్వారాలు, నగర నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం.

– చల్లా ఓబులేసు, కమిషనర్

ఘనంగా శోభాయాత్ర


ఆర్‌కే స్టోర్ ఆధ్వర్యంలో శోభాయాత్ర


ఆకట్టుకున్న పులివేషాలు

శ్రీకాకుళం కల్చరల్: అయోధ్య బాలరాముని ప్రతిష్ట ఉత్సవాల సందర్భంగా నగరంలోని దినేష్ మోదీ /ఆర్.కె.స్టోర్ ఆధ్వర్యంలో సోమవారం సుమారు 8 వేల మందితో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధులు రామనామ స్మరణతో మారుమోగాయి. శోభాయాత్రలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ బాలరాముని ప్రతిష్ట అపురూప ఘట్టమని పేర్కొన్నారు. రామాయణం మతగ్రంథం మాత్రమే కాదని.. మనిషి ఎలా జీవించాలో స్పష్టంగా వివరించిన ఉత్తమ గ్రంథమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శనలు, ప్రత్యేక వేషధారణలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి మంగళవారం ప్రారంభించారు. జీజీఎంపీ నిధులు రూ.9లక్షలతో పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో మండల విప్ బగ్గు రాజారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నేతింటి సత్యనారాయణ, గొలివి రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు


చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ రాసిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకంలో సూత్రాలు, చంద్రయాన్, వికసిత భారత్ తదితర అంశాలపై 16 విద్యాసంస్థల నుంచి 100 మంది విద్యార్థులు అద్భుతమైన చిత్రాలు గీశారు. విజేతలకు ఆలమ్ బహుమతులు ప్రదానం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం పంచాయతీ హకీంఖాన్‌పేట సమీపంలో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై ఎచ్చెర్ల పోలీసులు దాడి చేశారు. రూ.26 వేలు నగదు స్వాధీనం చేసుకుని, 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న నాగరాజు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను సర్పంచ్ సాకేటి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బి.శ్రీదేవి, హెచ్‌ఎం నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి

శ్రీకాకుళం న్యూకాలనీ: రైతులకు న్యాయం చేయాలంటూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళంలో నిరసన చేపట్టారు. అనంతరం అనంతరం వంశధార ఎస్‌ఈకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురపాటి కుమారస్వామి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకపాటి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సుభాష్ చంద్రబోస్


శ్రీకాకుళం కల్చరల్: గాంధీ స్మృతివనం మందిరంలో సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

స్వాతంత్ర ఉద్యమ పోరాట యోధుడు, అపార దేశభక్తి కలిగిన నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేతాజీ సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


శ్రీకాకుళం కల్చరల్: బలగ గ్రంథాలయంలో బోస్‌కు నివాళులు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు


ఎచ్చెర్ల: ధర్మవరం హైస్కూల్లో బోస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న స్థానికులు


శ్రీకాకుళం కల్చరల్: కేంద్ర గ్రంథాలయంలో నేతాజీ జయంతి వేడుకలు


రణస్థలం: ఎంపీడీఓ నేతాజీకి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేత పిన్నింటి సాయికుమార్, నాయకులు


శ్రీకాకుళం న్యూకాలనీ: నేతాజి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాకినాడ శ్రీఆదిత్య ప్రిన్సిపాల్ వేణుగోపాల్

మహిళల ఆర్థికాభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం


ఇప్పిలిలో మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- ఆసరా కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, స్త్రీల జీవన ప్రమాణాలు పెరిగింది కూడా ఈ ప్రభుత్వ హయాంలోనేనని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి గ్రామంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు నాలుగో విడతగా రూ.15,92,01,678ను విడుదల చేయడం హర్షణీయమన్నారు. 2014లో చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీను తుంగలోకి తొక్కి మహిళలను మోసగించారని గుర్తు చేశారు. సీఎం జగన్ మాత్రం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా మహిళల అకౌంట్లలో డబ్బులు జమ చేశారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం మేలు చేసిన జగన్‌ను గెలిపిస్తారో, మరోసారి ఉచిత గ్యాస్ సిలిండర్లు పేరిట మాయ మాటలు చెబుతున్న చంద్రబాబును గెలిపిస్తారో మీ చేతుల్లోనే ఉందన్నారు. తాను చిన్నతనంలోనే రాజకీయాల్లోకి వచ్చానని, 33 ఏళ్లకే మంత్రినయ్యానని, 25 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేశానని మంత్రి గుర్తు చేశారు. అవినీతి, అబద్ధపు మాటలు తనకు చేతకావన్నారు. భవిష్యత్‌తరాలు బాగుండాలంటే మరోసారి జగన్‌ను గెలిపించాలని కోరారు.

- వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలన్నారు. దళారులు, లంచగొండితనాలకు ఈ ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమన్నారు. జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పార్టీ నాయకులు లోలుగు శ్రీనివాసరావు, కనుగుల అప్పలనాయుడు, గంగు నరేంద్రకుమార్, కరణం శ్రీను, ఇప్పిలి బాబు, సూరాడ సూర్యం, యజ్జల గురుమూర్తి, ఎంపీడీఓ రామ్మోహన్‌రావు ఎంపీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వాటర్ ట్యాంక్ పనుల శంకుస్థాపనలో మంత్రి ధర్మాన ప్రసాదరావు


మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

టీడీపీ నేతల స్వార్థ ప్రయోజనాల కోసమే దుష్ప్రచారం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో రోడ్లు, కాలువలు, 6 అర్బన్ హెల్త్‌సెంటర్లు, పార్కుల నిర్మాణం.. ఇవన్నీ అభివృద్ధి కాదా అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రతిపక్షాలను ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేనితనంతో టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలో రూ 2.40కోట్లతో వెయ్యి కిలో లీటర్ల సామర్థ్యంగల మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. కొత్తపేటలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, సాధు వైకుంఠరావు, చల్ల శ్రీను, రావాడ జోగినాయుడు, గంజి వాసు, రుప్ప శేషగిరి, పాపారావు, చల్ల అలివేలుమంగ, పి.సుగుణారెడ్డి, టి.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉషా పోటీల విజేతకు సన్మానం


ముద్దాడ శిరీషను సన్మానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఇటీవల నిర్వహించిన సౌత్‌జోన్ ఉషా పోటీల్లో శ్రీకాకుళం రూరల్ మండలం సానివాడ గ్రామానికి చెందిన శిరీష విజేతగా నిలిచింది. ఈమెను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం సానివాడలో ఏర్పాటు చేసిన అభినందన సభలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించి ఉషా పోటీల్లో విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఏ సహాయం కావాలన్నా చేస్తానని మంత్రి హామీఇచ్చారు. చదువుతో పాటు క్రీడల్లోనూ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, పార్టీ నాయకులు రుప్ప అప్పలసూరి, ఉంగటి గోపాలం తదితరులు పాల్గొన్నారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com